


కనకదుర్గమ్మ తల్లికి బోనాలు


పిడుగురాళ్ల: పట్టణంలోని వాసవీనగర్‌లో ఉన్న కనకదుర్గమ్మ తల్లికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 526.40 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,202 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గాజుల అలంకరణలో మహంకాళీ అమ్మవారు



దుగ్గిరాల: కంఠంరాజుకొండూరు గ్రామంలోని మహంకాళీ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి గాజుల అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రేపల్లె: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ ఎప్పుడూ ప్రజాసంక్షేమాన్ని కోరుకుందని, ఆ దిశగానే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగులు పడ్డాయని గుర్తుచేశారు. కూటమి కుయుక్తులపై వైఎస్సార్ సీపీ బలంగా పోరాడుతుందని, ఎక్కడా తగ్గేదిలేదన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నియోజకర్గంలో ప్రజలకు నిరంతరం తోడుగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రేపల్లె పట్టణ, మండలాల కన్వీనర్లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరరావు, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, చిమటా బాలాజీ, అబ్దుల్ ఖుద్దూష్, గౌస్, నీలా నాంచారయ్య, పట్టెం శ్రీనివాసరావు, కొలుసు బాలకృష్ణ, సజ్జా పద్మావతి, కాటూరి శారద, లియాఖత్ భాషా, ఆలా రాజ్‌పాల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం




ప్రత్తిపాడు: రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపిన ప్రకారం... వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన ఓ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నిల్వ చేశారన్న సమాచారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు అందింది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ జి. భానుదయ, సీఐ రమానాయక్, సిబ్బందితో కలిసి మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారాన్ని రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులకు తెలియజేశారు. వట్టిచెరుకూరు తహసీల్దార్ క్షమారాణి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌లు మిల్లు వద్దకు చేరుకున్నారు. బస్తాల్లో నిల్వ చేసిన సుమారు 60 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తొలి ఏకాదశి పూజలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి సంస్థ పరిధిలోని ఆరవ బెటాలియన్‌లో ఆదివారం ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి సారె చీరెలు సమర్పించడం ఆనవాయితీ అని, అమ్మవారి దయతో కుటుంబాలు సంతోషంగా ఉంటాయని నమ్మకం అని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆశీర్వాదం, అధికారులు, స్థానిక మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శివాలయం వీధికి చెందిన మహిళలు ఆదివారం విజయవాడ కనక దుర్గమ్మ వారికి ఆషాఢ సారె సమర్పించారు. శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవాలయంలోని పార్వతీ దేవికి తొలుత సారె సమర్పించి, మేళతాళాలతో కాలినడకన విజయవాడ దుర్గమ్మ వారికి సారె తీసుకెళ్లారు. స్థానిక మహిళలు అమ్మాజి, అనూష, సరళ, స్రవంతి, కౌసల్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌలుకోలేని దెబ్బ

- మద్దతు ధర లేక.. సాగు సాయం రాక తీవ్ర నష్టాలు
- ఈ ఖరీఫ్ సాగుకు ముందుకు రాని కౌలు రైతులు
- గతంలో మహర్దశ .. నేడు దుర్దశ
- జిల్లాలో కౌలు ధరలు ధమాల్
- ఈ ఏడాది క్రాప్ హాలిడే ప్రకటిస్తామంటున్న రైతన్నలు
- గిట్టుబాటు ధరలు లేకపోవటమే ప్రధాన కారణం
- రుణాలు ఇచ్చేవారు కరువు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం

దుర్భర స్థితిలో కౌలు రైతు



సీజన్ ప్రారంభమైనా పొలాలు బాగు చేయని రైతులు


యద్దనపూడి: వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో పడింది. పది మందికి పట్టెడన్నం పెట్టే అన్నదాత అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి ఆరుగాలం కష్టపడినా గిట్టుబాటు ధర లేకపోవటంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకోగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీజన్ ప్రారంభమవుతున్నా కూడా అన్నదాత సుఖీభవ ఇస్తామంటూ ఒక్కరూపాయి కూడా ఇవ్వని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా సొసైటీలు, బ్యాంకుల్లో అప్పు చెల్లించలేదంటూ బంగారం వేలం వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో క్రాప్ హాలిడే ప్రకటించేందుకు కౌలు రైతులు సమాయత్తమవుతున్నారు.

కౌలు రైతులే అధికం

జిల్లాలో 3.87 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 1.87 లక్షల మంది రైతులున్నారు. వీరిలో 70 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారు. గత ఏడాది ప్రభుత్వం లక్ష మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేయగా 22 వేల మందికి మాత్రమే బ్యాంకుల ద్వారా కౌలు రైతులు రుణ సదుపాయం పొందారు. ఈ ఏడాది లక్ష మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 17,867 మందికి మాత్రమే కౌలు కార్డులు మంజూరు చేశారు. పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో గత ఏడాది 9089 మంది సీసీఆర్ కార్డులు మంజూరు చేయగా ఈ ఏడాది 1156 మందికి మాత్రమే కౌలు కార్డులు మంజూరు చేశారు.

సాగు సమయం ఆసన్నమవుతున్నా..

వాస్తవానికి ప్రతి ఏడాది రోహిణికార్తె నుంచి కౌలు వ్యవహారాలు సాగుతుంటాయి. ఈ ఏడాది జూలై నెల ప్రారంభమైనప్పటికీ కౌలు లావాదేవీలు అరకొరగానే కొనసాగుతున్నాయి. జిల్లాలో సొంత భూమి సాగు చేసే రైతులకంటే 60 శాతానికి పైగా భూమి కౌలు రైతుల చేతుల్లోనే ఉంటుంది. భూ యజమానులు, కౌలుదారుల మధ్య ఓ మాట ప్రకారం ఆ తంతు సాగిపోతోంది. కానీ ఈ ఏడాది వరుస నష్టాలతో కౌలు సాగుకు కర్షకులు అంతగా ఆసక్తి చూపటం లేదు. కౌలు ధర తరువాత నిర్ణయించుకుందామని తొలుత సాగు చేయమని భూయజమానులు కోరుతున్నా కౌలుదారుల నుంచి ఆశించిన స్పందన రావటం లేదు. గత ఏడాది పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, మార్టూరు తదితర మండలాల్లో గత ఏడాది ఎకరా రూ.30 వేల నుంచి రూ.38వేల వరకు పొగాకు, మిర్చి పంటలకు కౌలుకు తీసుకోగా, అదే ఎకరా ఈ ఏడాది రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు పడిపోయింది.



‘మద్దతు’ లేదు.. రుణమూ రాదు

ఎన్నో కష్టాలు పడి గత ఏడాది పంటలు సాగు చేసిన కౌలు రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి రాలేదు. జిల్లాలో గత సంవత్సరం పొగాకు 57 వేల ఎకరాల్లో , మిర్చి 16,986 ఎకరాల్లో, పత్తి 1710 ఎకరాల్లో, మొక్కజొన్న 64 వేల ఎకరాల్లో, మిగతాది శనగ, జొన్న, వరి, తదితర పంటలు సాగు చేశారు. కానీ పొగాకు, మిరపకు గిట్టుబాటు ధరలేకపోవటంతో రైతులు నిండా మునిగిపోయారు. పత్తి, శనగ, వంటి పంటలు కనీసం మద్దతు ధర అమలుకాక పోగా ఇంకా తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది సాగు చేసేందుకు కౌలు రైతులు ముందుకు రావడం లేదు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కౌలుదారులకు నేరుగా బ్యాంకుల్లో రుణంపుట్టే దారి లేకుండా పోయింది. ప్రభుత్వం రుణ అర్హత పత్రాలు ఇస్తామని చెప్పినా అది ఆచరణలో పూర్తిగా అమలుకావటం లేదు.

గిట్టుబాటు ధర లేక కౌలు రైతులు నష్టపోతున్నారు



రాష్ట్ర ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప వ్యవసాయ రంగంలో వృద్ధి లేనేలేదు. ఉత్పత్తి వ్యయం కన్నా మద్దతు ధరలు 20 శాతం తక్కువ ఉన్నాయి. దీంతో పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రానందున రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కౌలుదారులకు సకాలంలో రుణ అర్హత పత్రాలు ఇచ్చి బ్యాంకర్ల ద్వారా వాస్తవ సాగుదారులకు రుణాలు మంజూరు చేయాలి.

– బత్తుల హనుమంతురావు, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు

సరైన గిట్టుబాటు ధరలు లేవు



నాకు 4 ఎకరాల సొంత భూమి ఉంది. దీనికి తోడు మరో 24 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మిరప, పొగాకు, శనగ వంటి పంటలు సాగు చేశా. పండించిన పంటకు గిట్టుబాటు ధర అటుంచి కొనే నాథుడే కరువయ్యాడు. గత సంవత్సరం ఒక ఎకరం పొలం 28 నుంచి 32 వేల వరకు కౌలు చెల్లించా. ఈఏడాది అంత కౌలు చెల్లించి సాగు చేసే పరిస్థితి లేదు.

– గనిపిశెట్టి రమేష్, చిమటవారిపాలెం

ప్రజలను వంచించిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి



మార్టూరు(చినగంజాం): రాష్ట్ర ప్రజలను చంద్రబాబు తన మోసపూరిత మాటలతో వంచన చేస్తున్నారని.. ప్రజలంతా అర్థం చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు ఇన్‌చార్జ్ గాదె మదుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ (రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో) అనే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన మార్టూరులోని ఇంటూరి ఫంక్షన్ హాలులో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు జంపని వీరయ్య చౌదరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గాదె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత బాబు జగ్జీవనన్‌రాం, మహానేత వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, రాష్ట్ర యూత్ వింగ్ సంయుక్త కార్యదర్శి ఉప్పలపాటి అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, మాజీ డెయిరీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, తాటి వెంకటరావు, ద్రోణాదుల మాజీ సర్పంచ్ పెంటేల సత్యనారాయణ, టౌన్ అధ్యక్షుడు అడక గంగయ్య, ఐటీ వింగ్ అధ్యక్షుడు జి. రవిచంద్, ఎస్టీ సెల్ చిన్ననాయక్, మండల వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, బండి రామయ్య, మైలా నాగేశ్వరరావు, గడ్డం మస్తాన్ వలి, బాబు నాయక్, మండల పార్టీ కన్వీనర్‌లు, మాజీ కన్వీనర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగం అధ్యక్షులు, వివిధ హోదాల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వారియర్స్ తదితరులు భారీగా పాల్గొన్నారు.

అడవి తల్లిపై గొడ్డలి వేటు



సూర్యలంక వెళ్లేదారిలో కూలిన జీడిమామిడి చెట్లను నరికిన స్థానికులు



ముత్తాయపాలెం బి సెక్షన్ పరిధిలో ఆదర్శనగర్ సమీపంలో దొంగలు నరికిన జామాయిల్ తోట

- అంతరిస్తున్న అటవీ విస్తీర్ణం
- రాత్రికి రాత్రే యథేచ్ఛగా తరలిపోతున్న కలప
- పచ్చని తోటలకు సైతం నిప్పంటిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



ముత్తాయపాలెం బి సెక్షన్ నుంచి దొంగతనంగా తరలిస్తున్న సరుగుడు బాదులు (ఫైల్)

బాపట్లటౌన్: పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతగానో దోహదపడతాయని, వాటిని పరిరక్షించాలంటూ ఊకదంపుడు ప్రసంగాలిచ్చే నాయకులు, అధికారులు పెంచిన తోటలను కాపాడటంలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. అటవీ ప్రాంతాన్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన అటవీ శాఖాధికారులు చుట్టం చూపుగా వచ్చి పోతుండటంతో దొంగల చేతికి తాళం ఇచ్చిన చందంగా మారింది. పగలు.. రాత్రి తేడా లేకుండా దుండగులు యథేచ్ఛగా అడవుల్లోని జామాయిల్, జీడి మామిడి చెట్లను నరికి ఇళ్లకు, మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత కొన్ని నెలలుగా తంతు జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్నారిలా..

మండలంలోని కప్పలవారిపాలెం, ముత్తాయపాలెం, రామానగర్, ఆదర్శనగర్, సూర్యలంక, కర్లపాలెం మండలంలోని పేరలి, తుమ్మలపల్లి, గణపవరం, నర్రావారిపాలెం, మేకలవారిపాలెం తదితర గ్రామాలకు అందుబాటులో ఫారెస్ట్ భూమి ఉంది. అయితే ఆయా గ్రామాల ప్రజలతో వేరే ప్రాంతాల్లో ఉన్న వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకొని రాత్రికి రాత్రే అడవికి వెళ్లి తోటలను నరకటం, వాటిని పడవల సాయంతో కాలువలు దాటించడం.. కాలువ దాటిని కలపను ట్రాక్టర్లు, ఆటోలలో వేరే ప్రాంతానికి తరలించడం పరిపాటిగా మారింది. ఇదిలా ఉండగా మరికొందరు ఉదయం సమయంలో తోటకు వెళ్లి వాళ్లకు నచ్చిన చెట్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని రాత్రి సమయంలో నరకడం జరుగుతుంది. నరికిన సరుకును రాత్రికి రాత్రే అవసరమైన వినియోగదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫారెస్ట్ అధికారుల నుంచి తప్పించుకునేందుకు పట్టణంలోని వివిధ అడితీల్లో కలపను ఇక్కడే కొనుగోలు చేసినట్లుగా ఫోర్జరీ బిల్లులు సృష్టించి తనిఖీల కోసం వచ్చిన అధికారులకు చూపించడం ఇక్కడి ప్రజలకు షరా మామూలైంది.

పెట్టుబడి ప్రభుత్వానిది.. సొమ్ము స్మగ్లర్లకు..

అటవీ ప్రాంతాల్లో రూ.లక్షలు వెచ్చించి జామాయిల్, సరుగుడు, జీడిమామిడి తోటలు వేశారు. అయితే అవి పెరిగిన తర్వాత తోటలకు వేలం నిర్వహించాల్సి ఉంటుంది. లేదంటే కట్‌చేసి టన్నుల ప్రకారం కలపను విక్రయించాల్సి ఉంటుంది. అయితే తోటలు పెరిగిన తర్వాత కట్ చేయకపోవడం, పలు రకాల తెగుళ్లు సోకి ఎండిపోతున్న చెట్లను అక్కడే వదిలివేయటంతో స్మగ్లర్లు ఎండిన చెట్లను వంట చెరకుగా, పచ్చిచెట్ల బాదులను శ్లాబులకు ఉపయోగించే బాదులుగా, పేపర్ మిల్లులకు విక్రయించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో బీట్‌లో మొక్కలు నాటేముందు కనీసం 10 వేల మొక్కలకు తగ్గకుండా నాటుతున్నారు. అవి పెరిగిన తర్వాత కనీసం రెండు వేల మొక్కలు కూడా ఉండటం లేదు. ఇంతజరుగుతున్నా ఫారెస్ట్ ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మగ్లర్ల బారినుంచి తోటలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అడవులు నరికినా అడిగేదెవరు?

బాపట్ల మండలం ముత్తాయపాలెం, కర్లపాలెం మండలం పేరలి ప్రాంతాల్లో అటవీ భూమి వేల ఎకరాల్లో ఉంది. వీటిల్లో ముత్తాయపాలెం సెక్షన్ పరిధిలో ఏ, బీ బీట్‌లు, పేరలి సెక్షన్ పరిధిలో ఏ, బీ బీట్‌లు ఉన్నాయి. వీటిల్లో జామాయిల్, జీడిమామిడి తోటలు సుమారు 25 వేల హెక్టార్ల మేర ఉంటాయి. అయితే తోటలు పెరిగిన తర్వాత వాటిని కొట్టించి వచ్చిన కలపను విక్రయించి ఆ సొమ్ముతో మిగిలిన అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే అధికారులు స్థానికంగా ఉండకపోవడం, తోటలకు అప్పుడప్పుడు చుట్టం చూపుగా వచ్చిపోతుండటంతో రాత్రికి రాత్రే సుమారు వందల సంఖ్యలో జామాయిల్ బాదులు మార్కెట్‌కు తరలివెళ్తున్నాయి.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్-2025 కౌన్సెలింగ్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర సాంకేతిక విద్య, ఉన్నత విద్యా మండలి
- 17 వరకు హెల్ప్‌లైన్ కేంద్రాల వారీగా ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన
- ఈ నెల 13 నుంచి 18 వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లు



ఏపీ ఈఏపీసెట్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్-2025) కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేశాయి. మే నెలలో జరిగిన ఏపీ ఈఏపీసెట్-2025 (ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించి, ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎదురు చూస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఏ ధ్రువపత్రాలు అవసరమంటే..

ఏపీ ఈఏపీసెట్-2025 వెబ్ బేస్డ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సిన ధ్రువపత్రాల జాబితాను నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. ఏపీ ఈఏపీసెట్-2025 ర్యాంక్ కార్డ్, హాల్ టిక్కెట్, ఇంటర్ మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం /టెన్త్ సర్టిఫికెట్, టీసీ, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, 2025-26 సంవత్సరపు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ప్రైవేటు విద్యార్థులకు రెసిడెన్స్ సర్టిఫికెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక వర్గ ధ్రువీకరణ పత్రాలు, శారీరక వైకల్యం గల విద్యార్థులకు సంబంధిత ధ్రువీకరణ పత్రం అవసరం అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలు

ఏపీ ఈఏపీసెట్-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఇందు కోసం ఏపీఈఏపీ సెట్ హాల్ టిక్కెట్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి లాగిన్ కావాలి.

- రిజిస్ట్రేషన్ సమయంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజును ఇదే వెబ్‌సైట్‌లో క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలి. ఏపీఈఏపీ సెట్ డీటైల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు.

దరఖాస్తు సమయంలోనే సర్టిఫికెట్ల పరిశీలన

ఏపీఈఏపీసెట్-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం హెల్ప్ లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వెబ్ బేస్డ్ విధానంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పూర్తి చేసింది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యే ‘రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకోండి’ అనే చోట క్లిక్ చేయాలి. తద్వారా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఏస్థాయిలో ఉన్నదీ తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తయిన విద్యార్థులకు కంప్యూటర్ స్క్రీన్‌పై కేండెట్ ఈజ్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజింగ్ ఆప్షన్స్ అని కనిపిస్తే, విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధం కావచ్చు. ఈ విధంగా కాకుండా ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ హెల్ప్‌లైన్ కేంద్రంలో పురోగతిలో ఉన్న పక్షంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈజ్ అండర్ ప్రోగ్రెస్ అని కనిపిస్తుంది.

సమీప కేంద్రం ఎంపిక ఇలా..

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు అసంపూర్తిగా ఉండటం, వివరాలు అసమగ్రంగా ఉన్న పరిస్థితుల్లో కాంటాక్ట్ హెల్ప్‌లైన్ సెంటర్ (హెచ్ఎల్‌సీ) అని డిస్‌ప్లే అవుతుంది. ఈ విధంగా డిస్‌ప్లే అయితే ఆన్‌లైన్‌లో పొందుపర్చిన హెల్ప్‌లైన్ కేంద్రాల జాబితా నుంచి తమకు సమీపంలోని కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అనంతరం విద్యార్థులకు సంబంధించి అసమగ్రంగా ఉన్న సర్టిఫికెట్ల వివరాలు డిస్‌ప్లేలో ప్రత్యక్షమవుతాయి. సంబంధిత సర్టిఫికెట్లను విద్యార్థులు తిరిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత సంబంధిత హెచ్‌సీఎల్‌లో అధికారులు వాటిని పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుంది. అనంతరం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.



వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు: **02**, సీట్లు: **780**

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు: **34**, సీట్లు: **29,460**

ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సంఖ్య: **23,536**

హెల్ప్‌లైన్ కేంద్రాలు ..

గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతో పాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఆయా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 17వ వరకు పరిశీలిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు ఈ నెల 19న తుది అవకాశం ఉండగా, ఈ నెల 22న సీట్ల కేటాయింపు జరుపుతారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు కళాశాలల్లో చేరికలు, ఆగస్టు 4వ తేదీ నుంచి బీటెక్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 36 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 30,240 సీట్లు ఉన్నాయి. వీటిలో రెండు ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు ఉండగా, 34 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 29,460 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ పరీక్షలో 23,536 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరిలో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా జాతీయస్థాయి విద్యాసంస్థల్లో చేరిన వారు ఉన్నారు.

క్లుప్తంగా

మాదకద్రవ్యాలతో యువత నిర్వీర్యం



గుంటూరు ఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్న యువత, విద్యార్థులు నిర్వీర్యమైపోతున్నారని ఏపీ పోలీస్ ఈగల్ విభాగాధిపతి ఐజీ ఆకే రవికృష్ణ పేర్కొన్నారు. డ్రగ్స్ నివారణపై ఆదివారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వలన నేరాలు అధికంగా ఉన్నాయని, అరికట్టేందుకు ప్రభుత్వం విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ యువతలో బాధ్యత పెంచేలా ఈగల్ వింగ్ తో కలిసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను పురుషుల కంటే మహిళలు అధికంగా వాడటం దురదృష్టకరమని, తల్లిదండ్రులు వారిపై దృష్టి పెట్టాలని తెలిపారు. మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆకే రవికృష్ణ ప్రారంభించారు. ఈగల్ పోలీస్ వింగ్ ఎస్పీ నగేష్ బాబు, డీఎస్పీ అరవింద్, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ భానుమతి పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు



నరసరావుపేట టౌన్: రొంపిచర్ల మండలం వీరవట్నంలో సాగు నీటి సంఘం కార్యాలయ శిలాఫలకాన్ని టీడీపీ గ్రామ నాయకులు శనివారం ధ్వంసం చేశారు. గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో అప్పటి మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు భవన నిర్మాణానికి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీన్ని గ్రామ టీడీపీలోని వ్యతిరేక వర్గం ధ్వంసం చేసింది. దీంతో టీడీపీలో ఉన్న అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ధ్వంసం చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వీరవట్నం గ్రామ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెలగమూరి వెంకటనారాయణ రొంపిచర్ల పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు

బాపట్ల టౌన్ : ఆర్టీసీ కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి వై. శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీలో రిటైరైన ఉద్యోగులకు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, లీవ్ఎన్ క్యాష్మెంట్ సెటిల్‌మెంట్ చెల్లింపులు సంవత్సరాలు గడుస్తున్నాసరే జరగడం లేదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వీరికి చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ప్రభుత్వం చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. 11వ పీఆర్సీ చెందిన 24 నెలలు బకాయిలు, డీఏ మంజూరు, డీఏ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగులు ఉద్యమాల బాట పట్టకుండా చూడాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఇవ్వాలనుకున్న ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయకముందే మూడు వేల ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయాలని, తక్షణమే వివిధ కేటగిరుల్లో 10 వేల మంది సిబ్బందిని నియమించుకొనేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, బాపట్ల జిల్లా ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ సురేష్ , ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రకోశాధికారి యం.డీఏ.సిద్ధిక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి శంకరరావు, రాష్ట్రకార్యదర్శి యస్.వి.కృష్ణారావు, రాష్ట్ర సహాయకార్యదర్శి బి.టి.వలి, నెల్లూరు జోన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు వాకా రమేష్, బాపట్ల జిల్లా అధ్యక్షులు పసుపులేటి చిరంజీవి, గుంటూరు జిల్లా కార్యదర్శి ఇ.విజయ్‌కుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఖాజా, కార్యదర్శి జి.తిరుపతిరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

సీనియర్ పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాటి శ్రీరాములు

బాపట్ల టౌన్: పంచాయతీ కార్యదర్శులపై రోజురోజుకు పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని సీనియర్ పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు అన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోంలో ఆదివారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. పల్నాటి శ్రీరాములు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా సరిపడా నిధులు లేకపోవడం వల్ల పారిశుద్ధ్య పనుల్లో కీలక పాత్ర పోషించే క్లాప్ మిత్రాలకు ఇచ్చే నెల జీతం రూ.6000 చాలక పోవడంతో పని చేసేందుకు ఎక్కువ మంది ముందుకు రావడంలేదన్నారు. ప్రభుత్వమే నెలకు పదివేల రూపాయలు చొప్పున నేరుగా చెల్లించాలన్నారు. ప్రస్తుతం పాత రిక్షాల స్థానంలో ఆటోలు, ట్రాక్టర్లు మంజూరు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శిని గ్రామ పంచాయతీ విధులకు మాత్రమే పరిమితం చేసి సచివాలయ డీడీవో బాధ్యతలు నుంచి తొలగించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సర్వేలను చేయించే బాధ్యత ఒక పంచాయతీ కార్యదర్శికి మాత్రమే అప్పగించడం వలన పని ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శుల పనితీరు అంచనా వేయడం సమంజసం కాదన్నారు. పారిశుద్ధ్యం లోపించిందనే పేరుతో ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ లాంటి చర్యలు తీసుకోవడం దుర్మార్గం అన్నారు. ఇటీవల వేటపాలెం మండలం పుల్లరిపాలెం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారని, ఆ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు డి.మురళి బాపూజీ, డి.సుజాత, ఎం.శ్రీనివాసరావు, షేక్ జిలాని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఓబేదు నియామకం



రేపల్లె: వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా రేపల్లె పట్టణానికి చెందిన చిత్రాల ఓబేదును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఓబేదు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. జగన్ యువసేన నియోజకవర్గ అధ్యక్షుడుగా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడుగా, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్ష పదవులతో పాటు గత ప్రభుత్వ హయాంలో ఏపీ రాష్ట్ర హస్త కళలశాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా జగనన్న వెంటే ఉంటానను. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. ఓబేదు మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున, రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఈవూరు గణేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓబేదుకు పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

సెల్‌ఫోన్ లేని బడి నేడు అవసరం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

తెనాలి: నేడు పిల్లల విద్యాభివృద్ధికి సెల్‌ఫోన్ అత్యంత అవాంతరంగా మారిందని, పాఠశాలలో సెల్‌ఫోన్‌తో పని లేని విధానం ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రావు అధ్యక్షతన ఆదివారం తెనాలి ప్రాంతీయ కార్యాలయంలో జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ప్రభావంతో పిల్లలు పాడైపోతున్నారని, ఉపాధ్యాయుల బోధనపై కూడా సెల్ ప్రభావం పడుతోందని అన్నారు. రోజువారీ రకరకాల సమాచారం అప్‌లోడ్, డౌన్లోడ్‌తో, ఆన్‌లైన్ శిక్షణలతో బోధన సమయం హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా సెల్ ఫోన్ వాడకం నియంత్రణలో ఉంచుకోవాలని ఆయన సూచించారు. బోధన సమయాన్ని పిల్లలకు మాత్రమే కేటాయించాలని, పాఠశాల రోజువారీ పనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉపాధ్యాయులపై, అధికారులపై ఉందన్నారు. అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలలో సమయాన్ని గడిపి విద్యార్థులకు మార్గదర్శనం చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ పీటీఎంలో విట్నెస్ అధికారిని నియమించాలనే ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టీఎస్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్‌లు మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్లు తర్వాత ఉపాధ్యాయులకు డీడీఓ కోడ్స్, పొజిషన్ ఐడీలో తక్షణం కేటాయించి జీతాలు ఈ నెలలోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు ఎ.వెంకటేశ్వర్లు, కోశాధికారి దొలా, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

చినపులివర్రులో టీడీపీ నాయకుడి ఆగడాలు



చినపులివర్రు వద్ద డ్రెయిన్‌లో యంత్రాలను వినియోగించి చేపట్టిన మట్టి తవ్వకం



మట్టి తవ్వకానికి వినియోగించిన యంత్రాల కారణంగా ధ్వంసమైన బీటీ రోడ్డు

- డ్రెయిన్‌లో పూడికతీసిన మట్టి పొలం దారికి తరలింపు
- రహదారి ధ్వంసం
- స్థానికుల ఆగ్రహం

కొల్లూరు: అధికార దాహంతో టీడీపీ నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. చినపులివర్రుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు గ్రామం ప్రారంభంలో ఉన్న డ్రెయిన్‌లో పూడిక తీసి ఆ మట్టిని తన పొలానికి వెళ్లే దారి కోసం కాలువకు అడ్డుగా మెరక పోసుకున్నాడు. టీడీపీ నాయకుని తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో పంటలు ముంపునకు గురికాకుండా వర్షపు నీరు పారుదలకు వినియోగపడాల్సిన డ్రెయిన్‌ను మెరుగు పరచడంలో నిర్లక్ష్యం వహించడంతోపాటు, డ్రెయినేజీ కట్టలను బలపర్చడానికి వినియోగించాల్సిన పూడిక తీత మట్టిని సొంత అవసరాలకు పచ్చ నాయకులు తరలించుకోవడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. మట్టిని తరలించుకుపోవడానికి తోడు భారీ యంత్రాన్ని మట్టి తవ్వకానికి వినియోగించడం కారణంగా ఆర్అండ్‌బీకి చెందిన బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భరద్వాజ రచనలు సందేశాత్మకం



బీరం సుందరరావుకు సత్కారం

చీరాల: సమాజంలోని ఆకలి, ఆవేదన, కష్టాలు, కన్నీళ్లు, దోపిడీ వంటి కథాంశాలను వస్తువులుగా స్వీకరించి సమకాలిన సామాజిక సందేశాలుగా రావూరి భరద్వాజ రచనలు చేశారని రచయిత బీరం సుందరరావు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో రావూరి భరద్వాజ సాహితి సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రావూరి భరద్వాజ జయంతిని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఎ.నాగవీరభద్రాచారి అధ్యక్షత వహించారు. భరద్వాజ రచనలు జీవితానికి ఎంతో ఉపయోగపడతాయని, వారు సృష్టించిన పాత్రలు సజీవాలని రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి అన్నారు. అనంతరం బీరం సుందరరావుకు రావూరి భరద్వాజ సాహితీ పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో కడలి జగదీష్‌కుమార్, గొర్రెపాటి ప్రభాకర్, కట్టా రాజ్ వినయ్‌కుమార్, గాదె హరిహరరావు, అత్తులూరి రామారావు, వడలి రాధాకృష్ణ, నాగమాంబ, కోట వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై పిచ్చి కుక్క దాడి



పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాలైన అమన్



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన హుస్సేన్

పెదకూరపాడు: పెదకూరపాడులోని ముస్లిం కాలనీలోని పిచ్చి కుక్క ఆరుగురుపై ఆదివారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. నాలుగేళ్ల పఠాన్ మహ్మద్ అమన్, వృద్ధుడు షేక్ ఖాసిం, సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న షేక్ హుస్సేన్, నిమ్మకాయల వ్యాపారి షేక్ ఖాసింలతో పాటు మరో ఇద్దరిపై దాడిచేసి కరచింది. నాలుగేళ్ల అమన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జూన్ 18వ తేదిన మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన చిన్నారులు, వృద్ధులు 16 మందిపై పిచ్చి కుక్క దాడి చేసింది. రోడ్డు పక్కనే మాంసం విక్రయాలు జరుపుతుండంతో గుంపులు కుక్కలు అమరావతి, సత్తెనపల్లి కాలచక్ర రోడ్డుపై తిరుగుతూ వాహనదారులను కరుస్తున్నాయి.

దొంగల బీభత్సం



చోరీ జరిగిన రాధాకృష్ణ హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ షాపులో వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు



దొంగలు పగలగొట్టిన షాపు వెనుక వైపు తలుపు


- పలుచోట్ల సీసీ కెమెరాలు ధ్వంసం
- రూ.3 లక్షల సామగ్రి దొంగతనం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో సాయిబాబా గుడి వద్ద శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు చోరులు బీభత్సం సృష్టించారు. ఉండవల్లి రోడ్డులో తిరుగుతూ పలుచోట్ల సీసీ కెమెరాల వైర్లు ధ్వంసం చేశారు. ఎలక్ట్రికల్ షాపులో చోరీ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. రాధాకృష్ణ హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ షాపు యజమాని శనివారం రాత్రి 10 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి వెళ్లారు. అనంతరం 12.10 నిమిషాలకు ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి హార్డ్‌వేర్ షాపు చుట్టుపక్కల సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి, కెమెరాలను ధ్వంసం చేశారు. 1.45 గంటలకు షాపు రేకులపై నుంచి వెనుకవైపు ఉన్న చిన్న సందులోకి దిగారు. పలుగుతో వెనుక తలుపు పగలగొట్టి లోపలకు దూరారు. 2.45 గంటల వరకు షాపులో ఉండి వస్తువులను మూటలు కట్టుకుని గోడ అవతల విసిరి వేశారు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. మాస్కులు ధరించడంతో గుర్తించడం కష్టంగా మారింది. షాపు యజమాని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గుంటూరు నుంచి వేలిముద్రల నిపుణులు వచ్చి పరిశీలించారు. షాపులో సుమారు రూ.3 లక్షల విలువైన సరుకు, రూ.50 వేలు చోరీ అయినట్లు యజమాని తెలిపారు.

కొనసాగుతున్న నాటికల పోటీలు



'ఐ యేట్ ఇండియా' నాటికలో ఓ సన్నివేశం



'అ సత్యం' నాటికలో ....

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ – తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు రెండవ రోజైన ఆదివారం కొనసాగాయి. ప్రదర్శనలకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేశారు. సినీ మాటల రచయిత, కళల కాణాచి, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, పోస్టల్ ఎంప్లాయీస్ కళాపరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి వెంకట నారాయణ పాల్గొన్నారు. తొలిగా చైతన్య కళాస్రవంతి–ఉక్కునగరం, విశాఖ వారి 'అ సత్యం' నాటికను ప్రదర్శించారు. సుధ మోదుగు మూలకథకు పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరించగా పి.బాలాజీనాయక్ దర్శకత్వంలో ప్రదర్శించారు. తదుపరి న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విజయవాడ వారి 'ఐ యేట్ ఇండియా' నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం ఎం.ఎస్.చౌదరి. చివరిగా యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి 'అనుకున్నదొకటి అయినదొక్కటి' హాస్యనాటికను ప్రదర్శించారు. గోపి వల్లభ రచనకు ఆర్.వాసుదేవరావు దర్శకత్వం వహించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ For Medical and Engineering Management Seats AP, Telangana, Tamilnadu, Karnataka and aboard. 99661 34446

REAL ESTATE

HOUSE FOR SALE

■ బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్య గల రోడ్డు ప్రక్కన గల పటేల్‌నగర్ 1వ లైనులో బీజేపీ ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్తుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 9949843944, 9441649539

LAND FOR SALE

■ GNT నందివెలుగు రోడ్డు మెయిన్ రోడ్డు ఆనుకొని 140 చ.గ. ఖాళీ స్థలం వేంకటేశ్వర స్వామి గుడి ఎదురు ఉత్తర ఫేసింగ్‌తో అమ్మబడును. సంప్ర: 7680899937, 8328565074

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర. ✆ 87907 41166

WANTED

■ గుంటూరు టు విజయవాడ హైవేలో టీ స్టాల్ నందు కౌంటర్ వద్ద పనిచేయుటకు లేడీస్ స్టాఫ్ కావలెను. వసతి కలదు. 9985993199

■ అకౌంటెంట్ కావలెను. బీకాం, 5సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ ప్రిపేర్ చేయగలిగి, GST రిటర్న్ వేయగలిగిన వారు రెజ్యూమలను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ గుంటూరు నగరంలో ప్రముఖ స్కూల్లో Classical Dance, Western Dance, Chess Masters & Primary Tachers కావలెను. ✆ 9447660603

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444988/ 89

■ Wanted B-Pharmacy / D-Pharmacy candidates to work in a pharmacy in guntur pci registration mandator packing/Delivery boys. 6300975241

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 5వ అంతస్తు, కెథెస్ మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ – 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు ; పేరు ; శ్రీ షాహిన్షా హుస్సేన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 99891 79786
ఆస్తి తనిఖీ కొరకు : 92912 32223

ఇ.-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 9(1)తో చదువబడు రూల్ 8(6) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము) SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే [illegible] "ఎక్కడ ఏలా ఉన్నది అక్కడ అలాగే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై [illegible]

1) ఋణగ్రహీత: ఉప్పాల నళిని, భర్త: దాసరి శ్రీనివాసులు, డోర్ నెం. 12-24/1, సుల్తాన్ సెంటర్, లక్ష్మీ నేతిబిట్టి ఎదురుగా, హాస్టినాపురం, చీరాల – 523155, ఆంధ్రప్రదేశ్. దాసరి శ్రీనివాసులు, తండ్రి : కొండయ్య, డోర్ నెం.12-24/1, సుల్తాన్ సెంటర్, లక్ష్మీ నేతిబిట్టి ఎదురుగా, హాస్టినాపురం, చీరాల, ప్రకాశం జిల్లా – 523155, ఆంధ్రప్రదేశ్. ఉప్పాల నళిని, భర్త దాసరి శ్రీనివాసులు, [illegible] Assoc. ప్రొఫెసర్, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, చిక్ నాయునిపల్లె గ్రామం, వేటపాలెం మండలం, చీరాల, ప్రకాశం జిల్లా – 523167, ఆంధ్రప్రదేశ్. దాసరి శ్రీనివాసులు, తండ్రి : కొండయ్య, [illegible] Assoc. ప్రొఫెసర్, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, చిక్ నాయునిపల్లె గ్రామం, వేటపాలెం మండలం, చీరాల, ప్రకాశం జిల్లా – 523167, ఆంధ్రప్రదేశ్. ఉప్పాల నళిని, భర్త దాసరి శ్రీనివాసులు, డోర్ నెం. 2-22/1, నడిమూరు, వివేకానంద విగ్రహం వీధి, కావలి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా – 524224, ఆంధ్రప్రదేశ్. దాసరి శ్రీనివాసులు, తండ్రి : కొండయ్య, డోర్ నెం. 2-22/1, నడిమూరు, వివేకానంద విగ్రహం వీధి, కావలి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా – 524224, ఆంధ్రప్రదేశ్. డిమాండ్ నోటీసు తేది: 09-10-2024

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.09-10-2024 నాటికి రూ.30,12,745/- + వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.(ఏమైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును).

షెడ్యూల్ ఆస్తి వివరములు :
షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సర్వే కాలి డి.నెం.579, ఎ.7.00 సెంట్లు, డి.నెం.578, 568/1, 567-ఎ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సర్వే ప్రకారం, గుంటూరు డి.నెం.లు 579, 578/1ఎ, 568/1ఎ, 567-ఎలోని 18360 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం. (నమోదిత డోర్ నెం.15-15-79) హద్దులు: తూర్పు: టి. లక్ష్మీ నారాయణ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, ఉత్తరం: [illegible] మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా తూర్పు : 40' వెడల్పు రోడ్డు కొంతమేర మరియు తోట వెంకటేశ్వర్లు గారి ఆస్తి కొంతమేర, దక్షిణం : తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా తూర్పు : తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా దక్షిణం : తోట వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి, పడమర : [illegible] తలారి రాము గార్ల ఆస్తి కొంతమేర మరియు [illegible] శ్రీనివాసరావు గారి ఆస్తి కొంతమేర, మరలా ఉత్తరం : గుడి రామ్ ప్రసాద్ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా పడమర : [illegible] గారికి చెందిన ఆస్తి, మరలా ఉత్తరం : [illegible] గారికి చెందిన ఆస్తి.
ఈ హద్దులలో విస్తీర్ణం 18360 చ॥గ॥లు లేదా 15351.34 చ॥మీ॥ల స్థలం, దీనిలో
షెడ్యూల్-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తి 18360 చ॥గ॥ల మొత్తంలో 11642.1/4 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంలోని 47.1/4 చ॥గ॥లు లేదా 39.50 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశిత వాటాతో గల "[illegible] గార్డెన్", అంజనాద్రి బ్లాక్, "బి" బ్లాక్, [illegible] 1117 చ॥అ॥లు ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియా మరియు అంజనాద్రి బ్లాక్ యొక్క స్టిల్ట్ ఫ్లోర్ నందు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా) కామన్ ఎమినిటీస్ మరియు కామన్ దారులు, సదుపాయాలతో గల డబుల్ బెడ్ రూమ్ నివాస ఫ్లాట్ నెం.503. హద్దులు: తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై.
(రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2110/2019, తేది.01-03-2019 ప్రకారం గల ఆస్తి)
పైన తెలిపిన హద్దులలో ప్లింత్ ఏరియా 1117 చ॥అ॥లతో గల ఫ్లాట్, కామన్ ఏరియా మరియు పార్కింగ్ ఏరియా మరియు అన్ని లుకమెంట్ హక్కులతో కలదు.

రిజర్వు ధర : 17,49,000/-	ధరవత్తు : 1,74,900/-	బిడ్ పెంపుదల : 10,000

2) ఋణగ్రహీత: శ్రీ పఠాన్ సయీద్ ఖాన్, తండ్రి : హుస్సేన్ ఖాన్, డోర్ నెం. 17-2-207/ఎ, గొలుసుల కొండలరావు నగర్, 1వ లైన్, కొత్తపేట, గుంటూరు – 522003. వేరొక చిరునామా: శ్రీ పఠాన్ సయీద్ ఖాన్, తండ్రి : హుస్సేన్ ఖాన్, ఫ్లాట్ నెం.504, కన్నా టవర్స్, డి.నెం.823, అంకిరెడ్డిపాలెం బైపాస్, నల్లపాడు, గుంటూరు. డిమాండ్ నోటీసు తేది: 16-08-2022

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.16-08-2022 నాటికి రూ.25,69,201/- + వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.(ఏమైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును).

షెడ్యూల్ ఆస్తి వివరములు :
రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.3206/2019, తేది.20.05.2019, నల్లపాడు ఎస్ఆర్ఓ ప్రకారం: షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, నల్లపాడు, అంకిరెడ్డిపాలెం [illegible] గ్రామ పంచాయితీ, అంకిరెడ్డిపాలెం గ్రామ డి.నెం.823 లోని మొత్తం 2148.55 చ॥గ॥లు లేదా 1796.40 చ॥మీ॥ల విస్తీర్ణంలో గల "కన్నా టవర్స్ అపార్ట్‌మెంట్" యావత్తు ఆస్తి హద్దులు : తూర్పు: రోడ్డు - 151'-6", దక్షిణం : ఎస్. వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి - 128'.0", పడమర : పొన్నెగంటి లక్ష్మి మరియు ఇతరులకు చెందిన ఆస్తి - 169'.6", ఉత్తరం : వై. రాధా కృష్ణమూర్తి గారికి చెందిన ఆస్తి - 117.3".
పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం 2148.55 చ॥గ॥లు లేదా 1796.40 చ॥మీ॥ల స్థలం.
షెడ్యూల్-బి: పైన తెలిపిన 'ఎ' షెడ్యూలు స్థలం 2148.55 చ॥గ॥ల మొత్తంలో 42 చ॥గ॥లు లేదా 35.11 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో గల "కన్నా టవర్స్" నాల్గవ అంతస్తు నందు 1150 చ॥అ॥లు (కామన్ ఏరియాతో సహా) ప్లింత్ ఏరియాతో, అన్ని ఈజ్‌మెంట్ హక్కులు, కామన్ సౌకర్యాలు, కామన్ కారిడార్, ఉమ్మడి నీటి హక్కు, డ్రైనేజీ, మెట్లు, లిఫ్ట్, జనరేటర్ మొదలైనవి మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు కార్ పార్కింగ్‌తో గల నివాస ఫ్లాట్ నెం.504. హద్దులు : తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టుస్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర : 15,21,000/-	ధరవత్తు : 1,52,100/-	బిడ్ పెంపుదల : 10,000/-

ఇ-వేలం తేదీ : 18-08-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం: తేది: 07-07-2025 నుండి 16-08-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో పొందుపరిచిన లింకును రిఫర్ చేయండి. [illegible] సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 – 8291220220, Mail ID : support.baanknet@psballiance.com ను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఇతర ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటుటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.
తేది: 05-07-2025. ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా